## నోడల్ అధికారులు నివేదికలతో సిద్ధంగా ఉండాలి

### కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట, నవంబర్ 4: సార్వత్రిక ఎన్నికల కోసం నియమించబడిన నోడల్ అధికారులు పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి యస్. వెంకట్రావు సూచించారు. శనివారం తన చాంబర్‌లో నోడల్ అధికారులతో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సి- విజిల్‌యాప్ ద్వారా 187 ఫిర్యాదులు వచ్చాయని, నిర్దేశించిన సమయంలో అన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. ఎన్‌జీఆర్‌ఎస్ యాప్ ద్వారా 167 ఫిర్యాదులు రాగా ఇప్పటి వరకు 163 ఫిర్యాదులు పరిష్కరించామని, నాలుగు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగులకు , వృద్ధులకు పోలింగ్ రోజున ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ట్రై సైకిళ్లు, ఆటోలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. వారిని పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడానికి వాలంటరీలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎంసీసీ పక్కగా అమలు చేయలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో సతీష్‌కుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, డీఈవో అశోక్, ఆడిట్ అధికారి సంతోష్, డీటీడబ్ల్యూవో శంకర్, డీయస్‌వో మోహన్‌బాబు, డీడబ్ల్యూవో జ్యోత పద్మ, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, డీఎం సివిల్ సప్లయ్ రాంపతినాయక్, ఎఫ్‌డీవో రూపెందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు ఒకే ఒక్క నామినేషన్



ఆర్ఓ వీరబ్రహ్మాచారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పోతుల యాదగిరి

సూర్యాపేట, నవంబర్ 4: సూర్యాపేట అసెంబ్లీ నియోజక వర్గానికి రెండో రోజూ శనివారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వీర బ్రహ్మాచారి తెలిపారు. నకిరేకల్‌కు చెందిన పోతుల యాదగిరి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో ఇప్పటి వరకు సూర్యాపేట నియోజక వర్గానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

## ఒలింపియాడ్‌లో 'జయ' విద్యార్థుల అర్హత

సూర్యాపేట అర్బన్, నవంబర్ 4: రామానుజన్ గణిత అకాడమి రామచంద్రాపురం వారు నిర్వహించిన గణిత ఒలింపియాడ్‌లో 80 మంది విద్యార్థులు అర్హత సాధించారు.అర్హత సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాలలో కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అభినంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ తరగతి నుంచి 8 మంది, 6నుంచి 12 మంది, 7 నుండి 16 మంది, 8 నుండి 17 మంది, 9 నుండి 15 మంది ,10 వ తరగతి నుండి 12 మంది విద్యార్థులు రెండో లెవల్‌కు ఎంపికయ్యారన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు జెల్లా పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కాల్వలో పడి వృద్ధుడి మృతి

చివ్వెంల,నవంబర్ 4: ఎస్సారెస్పీ కాలువలో జారిపడిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బడితండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు వివిరాల ప్రకారం.. తండాకు చెందిన రాంచంద్రు(70) ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ కాల్వపై వేసిన తాటిమొద్దులపై నుంచి దాటుతున్న క్రమంలో రామచం ద్రు కాలు జారిపడి అక్కడి అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యవసాయ పొలాలకు వెళ్తున్న రైతులు చూసి సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ విషమయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ విష్ణు మూర్తి తెలిపారు.

## 17 లోపు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

సూర్యాపేట అర్బన్ నవంబర్ 4: పదవ తరగతి చదవుతున్న విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకుగాను నెల 17వ తేదీ లోపు పాఠశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రధానోపాధ్యాయులు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలను ఆప్‌లోడ్ చేసి అనంతరం జనరేట్ అయ్యే చలాన్ ద్వారా బ్యాంకులో చెల్లించి సంబంధిత పత్రాలను విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని అన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 12 , రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 21 వరకు చెల్లించవచ్చునని సూచించారు. పాఠశాలలు పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# పదేండ్ల పాలనలో ఎన్నో అద్భుతాలు

- రాబోయే రోజుల్లోనూ మరింత ప్రగతి సాధించుకుందాం
- కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్
- ఆకలి చావులు అరికట్టినం.. ప్రజల కడుపు నింపుతున్నం..
- నిరంతర విద్యుత్, పుష్కలమైన నీటితో పరిశ్రమలు పెరుగుతున్నయ్
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పేటలో కార్మికుల ఆత్మీయ సమ్మేళనం


సుమంగళి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 4: పదేండ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో ఎంతో ప్రగతి సాధించుకొని.. ఎన్నో అద్భుతాలు సృష్టించుకున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుమంళీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చిమ్మచీకట్లమయమవుతుందని హేలన చేసిన వాళ్ల కళ్లు చెదిరేలా.. రాత్రులు సైతం పగటిని తలపించేలా తెలంగాణలో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామని తెలిపారు. నిరంతర విద్యుత్‌తో చేతినిండా పని కలిపించి కార్మికుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందని ఆయన కొనియాడారు. పోరాడి సాధించిన తెలంగాణలో పదేండ్లుగా ఆకలి చావులు, వలసలు ఆగిపోయాయని.. చేతినిండా పని కలిపించి అన్ని విధాలుగా ఆదుకుంటూ అందరి కడుపు నింపుతున్నామన్నారు. నిరంతర విద్యుత్, పుష్కలమైన నీటితో పాటు ప్రశాంత వాతావరణం పెరగటంతో తెలంగాణలో పరిశ్రమలు పెరుగుతున్నాయన్నారు. దీంతో పెద్దపెద్ద వ్యాపారస్తులు సైతం ధైర్యంగా పెట్టుబడులతో ముందుకు వస్తున్నారన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రసాదించిన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సంచలనాత్మక మెడికల్ కళాశాలతో పాటు ఇతర జిల్లా కార్యాలయాలు ఏర్పాటు కావడంతో పాలన చేరువ కావడంతో పాటు ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. ఐటీ హబ్‌తో పాటు ఎన్నో అతి పెద్ద వస్త్ర, వ్యాపార సంస్థలు, మాల్, మల్టీప్లెక్స్‌లు ఇలా అన్ని రకాల వ్యాపార సంస్థలు ప్రశాంత వాతావరణంలో తమ వ్యాపారాలు కొనసాగించుకుంటున్నట్లు చెప్పారు. దీంతో కార్మికులకు చేతినిండా పని కలిపిస్తూ కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఘనత కూడా ఒక్క తెలంగాణ రాష్ట్రానికి, సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అంతే కాకుండా రాష్ట్రాన్ని సాధించుకుని అధికారం చేపట్టిన నాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతున్న తెలంగాణలో వలసల ఆగిపోవడమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వలసలు వచ్చి ఎంతో మంది కార్మిక కుటుంబాలు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో నిరంతరం అభివృద్ధి కొనసాగుతుందని పేర్కొన్నారు. అన్ని రంగాల అభివృద్ధితో పాటు కార్మికులను సైతం కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి ఆత్మగౌరవాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడకూడదని కార్మిక కుటుంబాలకు ప్రత్యేకంగా కార్మికబీమా పెట్టి ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ విషయం అందరికీ తెలియక ఎంతో మంది కార్మిక కుటుంబాలు ఆర్థిక నష్టపోయాయన్నారు. 18 ఏళ్ల నిండి 55 ఏండ్ల సంవత్సరాల వయస్సు కలిగిన కార్మిక కుటుంబాలన్నీ లేబర్ కార్డు పొందేందుకు అర్హులని తెలిపారు. ఇప్పటికే వీటిపై అవగాహన కలిపించి ఎంతో మంది కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా ప్రోత్సహిస్తూ అండగా నిలిచామన్నారు. కార్మికులంతా ఐక్యతను పెంచుకుంటూ అభివృద్ధిలో మరింత ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు గౌడ్, కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, సిలివేరు ప్రభాకర్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, వెంపటి గురూజీ, శివశంకర్, శివరామ్‌తో పాటు కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన కార్మికులు

# బీఆర్ఎస్‌తోనే మెరుగైన పాలన

**విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి సతీమణి సునీత**


పిల్లలమర్రిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సతీమణి సునీతా జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, నవంబర్ 4: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సతీమణి సునీతా జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 12వార్డు పిల్లలమర్రి గ్రామంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. రెండు పర్యాయాలు ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో చెప్పిన వాగ్దానాలన్నింటిని నెరవేర్చిన ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. సూర్యాపేటలో మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గుర్తించి మరోసారి మంత్రి జగదీశ్‌రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. సంక్షేమం కొనసాగాలంటే మరోమారు బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ఆమె కోరారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించి జరుగుతున్న అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బంగారి శ్రీను, రాపర్తి సైదులుగౌడ్, రాపర్తి శంకర్, రాపర్తి మహేష్, చెర్కుపల్లి ఉపేందర్, పూర్ణయ్య, నరేష్, సత్యవతి, అండాలు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.